నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, బుధవారం 28 ఫిబ్రవరి 2024 | HYDERABAD

బొమ్మ అఖిరానందన్ (ఫైల్)

అజరామరుడు అఖిరానందన్

తాను మరణిస్తూ ఐదుగురికి జీవనదానం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 27 : ఆ బాలుడి వయస్సు 11 సంవత్సరాలు మాత్రమే. కానీ తాను మరణిస్తూ మరికొందరికి కొత్త జీవితాన్నందించాడు. జీవన్‌దాన్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం....వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడకు చెందిన రాజ్‌కుమార్ దంపతుల కుమారుడు బొమ్మ అఖిరానందన్ (11) ఈ నెల 25న వాంతులు చేసుకొని అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు హైటెక్ సిటీలోని యశోద దవాఖానకు తరలించగా, చికిత్స అందించిన వైద్యులు 26న బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబీకులకు జీవన్‌దాన్ ప్రతినిధులు కల్పించగా అవయవదానానికి అంగీకరించారు. బాలుడి శరీరం నుంచి కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లను సేకరించారు.

సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాలకు అవార్డు

షీల్డ్‌లతో సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల డీన్ డాక్టర్ మాధురి శ్రీష్ కాటే

అమీర్‌పేట్, ఫిబ్రవరి 27: ఈఎస్ఐసీ 73వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ప్రతిభ చాటుతున్న ఈఎస్ఐసీ వైద్య కళాశాలలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ పోటీల్లో సనత్‌నగర్ ఈఎస్ఐసీ ద్వితీయ స్థానంతో రన్నరప్‌గా నిలిచింది. ఈ మేరకు ఫిబ్రవరి 24న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర కార్మిక మంత్రి భూపేందర్ యాదవ్ చేతుల మీదుగా ఈ రన్నరప్ షీల్డ్‌ను సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల డీన్ డాక్టర్ మాధురి శ్రీష్ కాటే అందుకున్నారు. మంగళవారం సనత్‌నగర్ ఈఎస్ఐసీలో జరిగిన ఓ కార్యక్రమంలో సనత్‌నగర్ ఈఎస్ఐసీ సాధించిన రన్నరప్ షీల్డ్ వివరాలను డీన్ డాక్టర్ మాధురి కాటే వివరించారు.

మెయింటెనెన్స్ చెల్లించకుంటే

ఫ్లాట్‌లో ఉండే హక్కులేదు

హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, ఫిబ్రవరి 27, నమస్తే తెలంగాణ : పట్టణ వనరులపై భారాన్ని తగ్గించే ఉద్దేశ్యంతో తెలంగాణ అపార్ట్‌మెంట్స్ (నిర్మాణం – యాజమాన్య ప్రమోషన్) చట్టం– 1987ను ప్రభుత్వం రూపొందించిందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ చట్టం ద్వారా అపార్ట్‌మెంట్ అసోసియేషన్లకు కల్పించిన అధికారాలను ధర్మాసనం సమర్థించింది. చట్టంలోని సెక్షన్ 21 రాజ్యాంగబద్ధతను ప్రశ్నిస్తూ బోలెంట్ ఇండస్ట్రీస్ ఎండీ శ్రీకాంత్ బొల్లా దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ శ్రవణ్ కుమార్ లతో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ శ్రీకాంత్ సోమాజిగూడలోని బాబు ఖాన్ మిలీనియం సెంటర్ అపార్ట్‌మెంట్‌కాంప్లెక్స్‌లో రెండు ఫ్లాట్‌లను తీసుకుని అందులో తన బొల్లాంట్ ఇండస్ట్రీస్ కంపెనీని స్థాపించారు. పార్కింగ్ స్థలం మొదలైన వివాదాల నేపథ్యంలో, అతను అసోసియేషన్‌కు నిర్వహణ చార్జీలు చెల్లించడం లేదు. సమస్య పరిష్కారానికి సంబంధిత వేదికల వద్దకు వెళ్లకుండా నేరుగా హైకోర్టుకు వచ్చి చట్టం చెల్లుబాటును ప్రశ్నించారని తప్పుపట్టింది. ఇలాంటి వ్యవహారాల్లో అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌కు తగినంత శక్తి లేకపోతే ఆ చట్టం వల్ల ప్రయోజనం శూన్యమని వ్యాఖ్యానించింది. అసోసియేషన్‌కు అధికారులు లేకపోతే చట్టం, దంతాలు లేని పులితో సమానమని వ్యాఖ్యానించింది. అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ యజమాని నిర్వహణ చార్జీలు చెల్లించకుండా ఉండే హక్కు లేదని తేల్చింది. ప్రాథమిక హక్కులకు కూడా సహేతుకమైన పరిమితులు ఉన్నాయని గుర్తు చేసింది. పార్కింగ్ వివాదాన్ని తగిన వేదిక వద్ద న్యాయ పోరాటం చేసుకోవచ్చునని స్పష్టం చేసింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.


అంబర్‌పేటలో జరిగిన పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్సీ మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్, అరెకపూడి గాంధీ

డూడూ బసవన్న కావాలా ఢిల్లీలో కొట్లాడే నాయకుడు కావాలా?

కిషన్‌రెడ్డి నియోజకవర్గానికి పైసా పని చేసిండా?

మతం పేరుతో లబ్ధి పొందడం బీజేపీకే చెల్లింది

కాంగ్రెస్ ఇచ్చినవి 420 హామీలు..

గులాబీ గెలుపు కోసం కార్యకర్తలు పని చేయాలి

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అంబర్‌పేటలో

పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం

పార్లమెంట్‌లో బీఆర్ఎస్సే తెలంగాణ గళం

గోల్నాక, ఫిబ్రవరి 27 : సికింద్రాబాద్ పార్లమెంట్‌కు డూడూ బసవన్న కిషన్ రెడ్డి కావాలా..? మన హక్కులు, అభివృద్ధిపై కొట్లాడే నాయకుడు కావాలా ? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మంగళవారం అంబర్‌పేట మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, అరెకపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, బీఆర్ఎస్ నేతలు తలసాని సాయి కిరణ్‌యాదవ్, రావుల శ్రీధర్ రెడ్డి తదితరులతో కలిసి కేటీఆర్ హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టి క్లీన్ స్వీప్ చేశారని వారందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. దాదాపు 15 ఏండ్లు ఉద్యమ కాలంలో, 10 ఏండ్లు తెలంగాణ అభివృద్ధిలో వంద స్పీడ్‌తో కారు దూసుకెళ్లిందని అన్నారు. అయితే కారు సర్వీసింగ్ అనంతరం వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో జెట్ స్పీడ్‌తో దూసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందన్నారు. 119 సీట్లలో 39 సీట్లు సాధించి బలమైన ప్రతిపక్షంగా ఉన్నామని అన్నారు. కాంగ్రెస్ దొంగ మాటలు నమ్మి కేసీఆర్‌ను దూరం చేసుకున్నామని ప్రజలు బాధ పడుతున్నారని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదని 420 హామీలని అన్నారు. కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదన్న కేసీఆర్ మాటలను ఇపుడు నిజం అవుతున్నాయని చెప్పారు. ఇక సికింద్రాబాద్ పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తన నియోజకవర్గానికి పైసా ఖర్చు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రపంచం గర్వపడేలా కాళేశ్వరం లిఫ్టులు ప్రారంభిస్తే...కిషన్ రెడ్డి మెట్రో రైల్వే స్టేషన్ లిఫ్టులు, సింటెక్స్ ట్యాంకులను ప్రారంభిస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ముఖం చూసి ఓటేయాలని కిషన్‌రెడ్డి అడుగుతున్నాడని, మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయ లబ్ధి పొందడం బీజేపీకే చెల్లిందన్నారు. తెలంగాణ కోసం పార్లమెంట్ లో గళం విప్పేది బీఆర్ఎస్ మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. వచ్చే పార్ల మెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో పని చేసిన నాయకులకు భవిష్యత్తులో మంచి గుర్తింపు నివ్వాలని కేటీఆర్‌ను కోరారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, బి.పద్మావెంకట్ రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి డీపీ రెడ్డి, బీఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డితో పాటు దాదాపు 3 వేల మంది బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీకి ముగిసిన నామినేషన్లు

నేడు దరఖాస్తుల పరిశీలన

బీఆర్ఎస్ 10, ఎంఐఎం 7, కాంగ్రెస్ నుంచి ఇద్దరు దాఖలు

వచ్చే నెల 2 వరకు ఉపసంహరణ గడువు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్ల దరఖాస్తు ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఈ నెల 20 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కాగా, చివరి రోజు తొమ్మిది నామినేషన్లు దాఖలు అయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి పది మంది కార్పొరేటర్లు, ఎంఐఎం పార్టీ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు సభ్యులుగా దరఖాస్తులు చేసుకున్నారు. చివరి రోజు ఎంఐఎం నుంచి గౌసుద్దీన్ , మహ్మద్ ఖాదర్, మహ్మద్ ముజఫర్ హుస్సేన్, ఫర్హద్ బిన్ అబ్దుల్ సమీఅద్ బిన్, మహమూద్ నసీరుద్దీన్, షాహీన్ బేగం, రఫత్ సుల్తానా, కాంగ్రెస్ నుంచి వై. ప్రేమ్‌కుమార్, ఈఎస్ రాజ్ జితేంద్రనాథ్ నామినేషన్ వేశారు. దరఖాస్తులను అధికారులు బుధవారం పరిశీలించనున్నారు. మార్చి 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్ల ఉపసంహరణ, ఆ తర్వాత అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. పోటీలో 15 మంది కన్నా ఎక్కువ మంది నిలిస్తే 7వ తేదీన జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలో ఎన్నిక పక్రియను నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

సికింద్రాబాద్‌లోని ఓ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధ్యాపకులు

విద్యార్థులూ.. ఒత్తిడి ఉంటే.. డయల్ 14416

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

జిల్లాలో 1.74 లక్షల మంది విద్యార్థులు

మొత్తం 242 పరీక్షా కేంద్రాలు

సెంటర్ లొకేటర్ యాప్‌లో పరీక్షా కేంద్రాల వివరాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో బుధవారం నుంచి జరుగబోయే ఇంటర్ పరీక్షలకు అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలో మొత్తం 1,74,784 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 80,583, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 93,784 మంది ఉన్నారు. జిల్లాలో 242 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. మాల్ ప్రాక్టీస్ జరుగకుండా 4 ఫ్లయింగ్ స్క్వాడ్, 10 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించనున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ప్రశ్నాపత్రం తీసే ప్రిన్సిపల్ గదిలో, సెంటర్ ఎంట్రన్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కరెంట్, అస్వస్థత ఇబ్బందులు తలెత్తకుండా ఏఎన్ఎం, విద్యుత్ సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. విద్యార్థులు వారి సెంటర్లను సులువుగా చేరుకునేందుకు ఇంటర్ బోర్డు వారు సెంటర్ లొకేటర్ యాప్ ప్రవేశపెట్టారు. అలాగే పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేందుకు 14416 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు చేరుకునేందుకు ట్రై కమిషనరేట్ పోలీసులు ట్రాఫిక్ రద్దీ ఉండకుండా చూసేలా అప్రమత్తమయ్యారు. మరో వైపు ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు చెప్పారు. బస్సుల రాకపోకల్లో ఆలస్యమైతే కోఠి–9959226160, రేతిఫైల్–9959226154 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారమివ్వాలని కోరారు. పరీక్ష రాసే అబ్బాయిలు రాయితీ బస్ పాస్, హాల్‌టికెట్ చూపిస్తే ఉచితంగా బస్సు ప్రయాణం చేయొచ్చని తెలిపారు.

ఏసీబీ డీజీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలు

రాజస్థాన్‌లో నిందితుడి అరెస్ట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ఐపీఎస్, ఐఏఎస్, ఎంపీ, ఎమ్మెల్యే, డాక్టర్లు.. ఇతర ప్రముఖుల పేర్లు, ఫొటోలతో సోషల్‌మీడియా నకిలీ ఖాతాలు క్రియేట్ చేసి, మోసాలకు పాల్పడుతున్న ఘరానా ఛీటర్‌ను సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అదనపు సీపీ ఏవీ రంగనాథ్ కథనం ప్రకారం..రాజస్థాన్, అల్వార్ జిల్లాకు చెందిన 22 ఏండ్ల నిందితుడు ఇంటర్‌నెట్‌లో ప్రముఖుల ఫొటోలను సేకరించి, డీపీగా పెట్టి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్త ఖాతా లు క్రియేట్ చేస్తున్నాడు. అలాగే, కొత్త నంబర్‌తో వాట్సాప్‌లో వారి డీపీని కూడా పెడుతారు. ఇలా ఏసీబీ డీజీ, సీవీ ఆనంద్ పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ఖాతాలు క్రియేట్ చేసిన నిందితుడు.. పలువురికి అత్యవసరంగా డబ్బులు కావాలని,ఇతర మెసేజ్‌లు పంపించాడు. ఈ విషయాన్ని గుర్తించిన సీవీ ఆనంద్ వెంటనే సైబర్‌క్రైమ్ పోలీసులను అప్రమత్తం చేయడంతో కేసు నమోదు చేశారు. ఏసీపీ చాంద్ భాషా నేతృత్వంలో ఇన్స్పెక్టర్ సైదులు బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ దర్యాప్తులో ఈ నకిలీ ఖాతాలన్ని రాజస్థాన్ నుంచి క్రియేట్ అయినట్లు గుర్తించి, సీసీఎస్ పోలీసుల ప్రత్యేక బృందం నిందితుడిని అరెస్ట్ చేసి, నగరానికి తరలించారు. కాగా, కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకొని.. ఎంత మందిని మోసం చేశాడనే విషయంపై ఆరా తీస్తామని పోలీసు అధికారులు వెల్లడించారు.

తెల్ల రేషన్ కార్డు లేక.. గృహజ్యోతికి దూరం

గ్రేటర్‌లో గృహజ్యోతి లబ్ధిదారులు 10.93 లక్షలు

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు 19.85 లక్షలు

తెల్లరేషన్ కార్డులు లేక అర్హత దక్కని వినియోగదారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకమైన గృహ జ్యోతిని అమలు చేస్తున్నట్లు మంగళవారం ప్రభుత్వం ప్రకటించింది. ప్రజాపాలన దరఖాస్తు, తెల్లరేషన్ కార్డుతో పాటు ఆధార్‌కార్డు లింకున్న వారిని నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందేందుకు అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)లోని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడు జోన్‌లు హైదరాబాద్ మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్‌లు ఉండగా, అందులో మొత్తం 9 సర్కిళ్లు ఉన్నాయి. ఆయా సర్కిళ్లలో ప్రాథమికంగా విద్యుత్ శాఖ అధికారులు ఈ నెల మొదటి వారం నుంచి 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వారిని గుర్తిస్తూ వస్తున్నారు. ఫిబ్రవరి 27నాటికి మొత్తం 10,93,228 మంది గృహ విద్యుత్ వినియోగదారులు ఉన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు గుర్తించారు. కాగా ప్రజాపాలనలో గృహజ్యోతి కోసం గ్రేటర్ పరిధిలో 19.85లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గింది. గృహజ్యోతి పథకం కింద గుర్తించిన విద్యుత్ వినియోగదారులకు మార్చి నెల నుంచి జీరో బిల్లును విద్యుత్ శాఖ జారీ చేయనుంది. డిస్కమ్‌లు మార్చి 20వ తేదీలోపు ప్రభుత్వానికి సబ్సిడీ వివరాలను అందించాల్సి ఉంటుంది. వాటిని ప్రభుత్వం నేరుగా డిస్కమ్‌లకు చెల్లిస్తుంది. ఇప్పటివరకు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోనివారు జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో, మునిసిపల్ కమిషనర్ కార్యాలయాల్లో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అక్రమ హోర్డింగ్‌లు తొలిగింపు

అనధికారిక ప్రకటనలపై స్పందించిన ఈవీడీఎం

80 ట్రాఫిక్ పోలీసుల గొడుగులు, 20 బస్ షెల్టర్లపై చర్యలు

నాలుగు బస్ షెల్టర్లను పూర్తిగా తొలగింపు

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ అడ్వర్టయిజ్‌మెంట్ విభాగంలో అక్రమాలకు అడ్డుకట్టవేసేందుకు ఎట్టకేలకు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి రంగంలోకి దిగారు. అనధికార ప్రకటనల అక్రమాలపై ఈ నెల 23న నమస్తే తెలంగాణలో 'ప్రచారం దండి.. ఖజానాకు గండి' శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఇందుకు స్పందించి రంగంలోకి దిగిన ఈవీడీఎం డైరెక్టర్ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కేబీఆర్ చుట్టూ ఉన్న 80 ట్రాఫిక్ పోలీసుల గొడుగులు, 20 బస్ షెల్టర్లపై ఉన్న అక్రమ ప్రకటనలను తొలిగించారు. అంతేకాకుండా అక్రమంగా ఉన్న నాలుగు బస్ షెల్టర్లను పూర్తిగా తొలగించారు. ఇదిలా ఉంటే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో జీహెచ్ఎంసీలో అడ్వర్టయిజ్‌మెంట్ విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కార్పొరేటర్లు తీవ్ర స్థాయిలో ఆధారాలతో ఎండగట్టారు. దీనిపై మేయర్ స్పందిస్తూ హౌస్ కమిటీ ఏర్పాటు చేసింది. దీంతో పాటు అక్రమాలను నిగ్గు తేల్చేందుకు విచారణ అధికారిని నియమించాలని కమిషనర్ రొనాల్డ్ రాస్‌కు మేయర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే విచారణ అధికారి, హౌస్ కమిటీ సభ్యులు రాక ముందే అనధికారిక హోర్డింగ్‌లను తొలగించే పనులు చేపట్టడంపై మతలబు ఏంటన్నది చర్చ జరుగుతున్నది. అలాగే డీఈఈ కార్డీక్‌పై విచారణకు ఆదేశించకుండా జీహెచ్ఎంసీ ఈఎన్సీకి రిపోర్టు చేయాలని బదిలీ చేయడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. హౌస్ కమిటీలో నిజాలు బయటపడతాయని రాత్రికి రాత్రే అక్రమ బస్ షెల్టర్లను తొలగిస్తూ, సమస్యను దారి మళ్లిస్తున్నారని కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు. జీహెచ్ఎంసీలో ప్రధాన రోడ్లతో పాటు ఆర్టీసీ, ప్రైవేట్ భవనాలపై ఉన్న హోర్డింగ్‌లను తొలగించే పనులు ఒకే కాంట్రాక్టర్‌కు టెండర్ పాలసీ నిబంధనలు ఉల్లంఘించి మరీ పనులు అప్పగించారన్న అరోపణలు వినిపిస్తున్నాయి.

తాగునీటి సరఫరాకు.. రేపు అంతరాయం



సిటీబ్యూరో, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లయి ఫేజ్ 1, 2 పంప్‌హౌజ్‌లో స్లూయిస్ వాల్వ్ రిపేర్లు, కలబ్‌గూర్, రాజంపేట్, పటాన్‌చెరు సబ్‌స్టేషన్లలో ఎలక్ట్రికల్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. ఈ పనులు ఈ నెల 29 గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ ఆరు గంటల పాటు ఎర్రగడ్డ, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్ (లో వాటర్ ప్రెషర్), డివిజన్–8, హైదర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, భాగ్యనగర్ కాలనీ, వసంత్‌నగర్, ఆర్సీ పురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, దీప్తి శ్రీనగర్, మదీనాగూడ, మియాపూర్‌తో పాటు మంజీరా ఫేజ్–1, బీరంగూడ, అమీన్‌పూర్, బొల్లారంలో అంతరాయం ఉంటుందని తెలిపారు.